కథ

గొల్లపూడి రాజ్యలక్ష్మి

# పరిష్కారం

ఎమర్జెన్సీ వార్డ్ డోర్ తెరుచుకుంది.

డాక్టర్ మేధ బయటకు వచ్చింది. అక్కడ కుర్చీలో కళ్లు మూసుకుని నిస్పృహలో కూరుకుపోయానట్లు కూర్చున్న నిర్మల వంక చూసింది. దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యి వేసింది.

నిర్మల చటుక్కున కళ్లు తెరిచి డాక్టర్ మేధ చేతులు పట్టుకుని "ఎలా వుంది?" అనడిగింది.

"గండం గడిచింది. నువ్వు వెంటనే తీసుకురావటం మంచిదయింది. ఇంకో గంటలో స్పృహ కూడా వస్తుంది. నువ్వింక కాస్త రిలాక్స్ అవు. ఏదైనా తాగుతావా?"

"ఏం వద్దు..నేనిప్పుడు ధీరను చూడవచ్చా?"

"చూద్దువుగాని..ఇప్పుడు కాదు. నువ్వు చాలా అలసటగా వున్నావు. రాత్రంతా నిద్రపలేదు కదా! పద..కాస్త రిఫ్రెష్ అయి టీ తాగుదువుగాని!" అంటూ నర్స్‌ని పిలిచి జాగ్రత్తలు చెప్పి నిర్మలను తన రూంకి నడిపించుకు వెళ్లింది.

చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని వచ్చి కుర్చీలో నీరసంగా జారగిలబడి కూర్చుంది నిర్మల. ఫ్లాస్క్‌లోంచి కప్పులోకి టీ వంచి ఇచ్చింది మేధ.

"సారీ మేధా! నిన్ను చాలా ఇబ్బంది పెడ్తున్నాను!"

"ఇదిగో ఇలాంటి మాటలతోనే ఇబ్బంది. నీకు సహాయపడటం కన్నా ఏదీ ముఖ్యం కాదు నీకు"

"కానీ మేధా.."

"చూడు నిర్మలా! నువ్వు నా ప్రాణ స్నేహితురాలివి. నీకూ నాకూ మధ్య క్షమాపణలు, మొహమాటాలు సంకోచాలు ఏమిటి చెప్పు? సరే ఆ సంగతి వదిలేయ్. ఇప్పుడు కాస్త స్థిమితపడ్డావనుకుంటాను?"

మేధ కళ్లల్లోకి చూసి నిట్టూర్చి అవునన్నట్లుగా తల పంకించింది నిర్మల.

డాక్టర్ మేధ కుర్చీలోంచి ముందుకు వంగి నిర్మల వంక సూటిగా చూస్తూ "ఇప్పుడు చెప్పు! అసలేం జరిగింది?" అనడిగింది.

నిర్మల చీరచెంగులో ముఖందాచుకుని ఏడవసాగింది. మేధ కాస్త ఆశ్చర్యంగా, బాధగా చూసింది. "నువ్వు ఏడ్వటమా? ఒద్దు నిర్మలా! అది నీ వ్యక్తిత్వానికి అతకదు!"

చివ్వున తలెత్తి చూసింది నిర్మల. "అంటే? నేను మనిషిని కానా? పొడిబారిన మనసుతో ఏ ఆర్ద్రతా లేని కరకు దాన్ననుకున్నావా? ధీర నా కూతురు మేధా! నా సర్వస్వం అదే అనుకుని బ్రతుకుతున్నదాన్ని. దానికేదైనా అయితే నా జీవితానికి అర్థం ఏముంది?"

"అసలు ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది? ఎంతో ఉత్సాహంగా, చలాకీగా వుండే ధీర..ఇంత పిరికిదాన్లా...తెలివి తక్కువగా స్లీపింగ్ పిల్స్ ఎందుకు మింగింది? మీ ఇద్దరి మధ్య తల్లీ కూతుళ్ల సంబంధం కంటే స్నేహం, అవగాహన ఎక్కువని నాకు తెలుసు"

"నిజమే! ఆ అతిశయంతోనే ఇన్నాళ్లూ బ్రతికాను. మా మధ్య ఒక తరం అంతరం వున్నా ఆ భావం ఎప్పుడూ రాలేదు. ఎంతో ప్లాన్డ్‌గా జీవితాన్ని మలుచుకున్నాను. ఇప్పుడంతా అయిపోయింది. ఏదీ మన చేతుల్లో లేదు. ఏది, ఎప్పుడు ఎలా జరగాలని రాసి పెట్టి వుంటుందో అలా జరుగుతుంది" అంది విరక్తిగా.

"ఇంతగా నీ మనసు గాయపడేలా ధీర ఏం చేసింది"

"దానిమీద పెట్టుకున్న ఆశల్ని..ఇన్నేళ్ల నా పెంపకాన్ని అపహాస్యం చేసింది"

"అంటే?"

"అది...అది ఆకర్షణలో పడింది"

"అది నువ్వు ఇష్టపడలేదు. ఇద్దరి మధ్యా వాడిగా వేడిగా ఘర్షణ జరిగివుంటుంది. క్షణికావేశంలో తొందరపడి ఈ పిచ్చిపిల్ల ఇంత దారుణానికి ఒడిగట్టింది..అంతేనా?"

"ఇష్టపడని మాట నిజమే. దానికి బలమైన కారణం వుంది. అది నా దగ్గర ఒక విషయం దాచి పెట్టి నా మనసుని గాయపర్చింది. ఆ బాధతో ఏదో అన్నాను. దాని తప్పు అది తెలుసుకుంటుందనుకున్నాను. ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందనుకోలేదు"

"ఏం దాచి పెట్టింది?"

"ఏ మనిషి ముఖాన్ని జీవితంలో చూడకూడదనుకున్నానో..ఆ మనిషితో సాన్నిహిత్యం పెంచుకుంది"

"ఆ మనిషి అంటే?" ప్రశ్నార్థకంగా చూసింది మేధ.

"ఔను..అతనే!"

"ధీర..అచ్యుత్‌ని కలవడమా? అదెలా సంభవం?"

"అదే కదా నా దురదృష్టం. పీడకలలాంటి గతాన్ని మర్చిపోయి, కొత్తగా జీవితాన్ని ఆరంభించి ధీరపైనే ఆశలు పెంచుకుని ఒక క్రమపద్ధతిలో కాలం గడుపుతున్న నన్ను దురదృష్టం వదిలి పెట్టలేదు. ప్రవర్ రూపంలో ఎదురైంది!"

"ప్రవర్ అంటే?"


"ధీర ఇష్టపడుతున్న కుర్రాడు. కాలేజీలో దానికి సీనియర్. తరచు ఇంటికి రాకపోకలు ప్రారంభించాడు. మనిషి ఒడ్డూ పొడుగుతో బాగానే వుంటాడు. కానీ అతని మాటల్లో భావాల్లో సంస్కారం కన్పించలేదు నాకు. దేన్నీ సీరియస్‌గా తీసుకోండి. ప్రతిదీ ఎంజాయ్ చేయాలంటాడు. ప్రేమ కూడా అందుకు మినహాయింపు కాదుట. ప్రవర్‌పై నాకు సదభిప్రాయం కలుగలేదు. అన్నింటినీ మించి అతి చనువు ప్రదర్శిస్తూ నన్నుద్దేశించి అన్న మాటలు అతని పట్ల జుగుప్సను కలిగించాయి"

"ఏమన్నాడు?"

"ఏమన్నాడని చెప్పను? ఆ మాటలు తల్చుకుంటేనే అసహ్యమేస్తోంది. ఈ వయసులో కూడా నేను అందంగా వున్నానుట. యవ్వనంలో ఎంతమంది నా మీద మనసు పారేసుకున్నారో..అన్నాడు. అనుభవించాల్సిన వయసంతా అడివిగాచిన వెన్నెలై మోడుగా మిగిలానుట..మీరు మళ్లీ పెళ్ళి ఎందుకు చేసుకోలేదు..అంటూ అధిక ప్రసంగం చేశాడు. నా మనసు కోపంతో వుడికిపోయింది. తల్లిలాంటి దాన్ని పట్టుకుని అడగవల్సిన మాటలేనా ఇవి? ఇన్నేళ్ళ నా జీవితంలో ఎప్పుడూ కలగని భావన, ఎవరి చేతా వేలెత్తి చూపించుకోని మచ్చ లేని జీవితం..ఆత్మవిశ్వాసంతో ఎంతో హుందాగా బ్రతుకుతున్న నన్ను..అంత అసభ్యంగా ప్రశ్నిస్తాడా? అందుకే ఘాటుగా జవాబిచ్చాను. 'చూడు బాబూ! ఒక్కో మనిషి జీవితంలో ఒక్కోదానికి ప్రాధాన్యత వుంటుంది. నేనేదో కోల్పోయాననీ, అనుభవించలేకపోయానని ఎప్పుడూ ఫీలవలేదు. అయినా అది నా వ్యక్తిగత విషయం. నీతో చర్చించాల్సిన విషయం కాదు. అంత సాన్నిహిత్యం మన మధ్య లేదు. పెద్దవాళ్లని పట్టుకుని ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి కామెంట్స్ చేయకు' అన్నాను. ఏమనుకున్నాడో మరి మాట్లాడలేదు. 'ఏంటమ్మా నువ్వు! ప్రతిదానికీ సీరియస్ అవుతావు. అతనన్నదాంట్లో తప్పేంవుంది. మన మంటే వున్న అభిమానంతో చనువుగా, నీమీద సానుభూతితో అన్నాడు. ఆ మాత్రానికే అతన్నలా అవమానించాలా? ప్రవర్ ఏమనుకుంటాడు?' అంది ధీర అతను వెళ్లాక.

అతనేమనుకుంటాడు? అని బాధపడ్తున్నావే? అతని మాటల వల్ల నేనెంత బాధపడతానో ఎప్పుడైనా ఆలోచించావా? అతనికి నామీద సానుభూతా? దేనికి? నేనేదో పోగొట్టుకున్నానని, జీవచ్ఛవంలా పడివున్నానని అతని దగ్గర ఏడ్చానా? ఎవరి దయాదాక్షిణ్యాలు పొందే పరిస్థితి నాకు లేదు. ఎంతో హాయిగా బ్రతుకుతున్నాను. వయసులో పెద్దదాన్ననైనా చూడకుండా నోటికేదొస్తే అది అనేయటమేనా! ఎంత ధైర్యం? అన్నాను కోపంగా. అది కాస్సేపు వూరుకుని, 'నిజం చెప్పమ్మా! ఎప్పుడూ నువ్వు

వంటరితనంగా ఫీలవలేదా? మరో తోడు కావాలని అన్పించలేదా? నీ అంతరాంతరాల్లోకి చూసి చెప్పు' అన



డిగింది. లేదు..లేదు..లేదు..నాకెప్పుడూ, అన్పించలేదు. నిజానికి నువ్వు పుట్టాకే నా వంటరితనం పోయింది. నీ చుట్టూనే నా ఆశలు, కలలు అల్లుకున్నాను. అనుక్షణం నీ భవిష్యత్ గురించిన ఆలోచనలతోనే గడుపుతున్నాను.

ఇప్పుడీ అర్థం లేని టాపిక్ లేవనెత్తి నా మనసును కల్లోలం చేస్తున్నారు. ఒ.కె. అమ్మా! ఇంక వదిలేయ్. ప్రవర్ తరఫున నేను సారీ చెప్తున్నాను. అతను కొంచెం అతిగా వాగుతాడే గానీ మంచివాడు. అమాయకుడు. ఎదుటి మనిషి మూడ్‌ని బట్టి మాట్లాడాలని తెలీదు అంటూ సమర్థించింది. అతని తరహా నాకు నచ్చలేదు ధీరా! నువ్వతనితో చనువుగా వుండటం నాకిష్టం లేదు అన్నాను స్పష్టంగా.

నీకు మగవాడంటే భయం మమ్మీ! నీలో నువ్వు ముడుచుకుని గిరిగీసుకుని కూర్చుంటే ఇలాగే వుంటుంది. ప్రవర్ సరదా మనిషి! అతనితో వుంటే కాలమే తెలియదు. అతనంటే నాకెంతో ఇష్టం..ప్రేమ! అంది ధీర.

మ్రాన్పడిపోయాను. ఇలాంటి సమాధానం కోసమా..ఇన్నాళ్లుగా కష్టపడింది. ధీర ఇలా తయారైందేమిటి? చిన్నప్పట్నుంచి గారాబంగా, ప్రేమగా పెంచటం వల్లనా? ఎక్కడుంది లోపం? నాలోనే వుందా? ధీర అన్నట్లు ప్రవర్‌ని సరిగ్గా అర్థం చేసుకోలేదా? అన్న ఆత్మవిమర్శలో పడ్డాను. ధీర నా చేతుల్లోంచి జారి మరో చేయి అందుకోబోతున్నందుకు బాధా? నా కళ్లతో చూస్తూ నా మనసుతో ఆలోచిస్తూ, నాకు మరో ప్రతిరూపంగా దాన్ని మలచాలని ఆశిస్తున్నానా? ఇది నా స్వార్థం కాదా? దానికీ స్వంత ఆలోచనలూ అభిప్రాయాలూ వుంటాయని అనుకోకపోవటం నా లోపమా? ఏది ఏమైనా అది నాకు డమ్మీ కాకూడదు. నా ఫీలింగ్స్ ఏవీ దాన్ని బాధించకూడదు. దాన్ని ఇష్టాన్ని, ఆశలనూ తల్లిగా అర్థం చేసుకోవాలి అని నన్ను నేను సమాధాన పర్చుకున్నాను. దాని ఎగ్జామ్స్ అయాక ప్రవర్‌తో పెళ్లి ప్రస్తావన చేద్దామనుకున్నాను. క్యాంపస్ ఇంటర్వ్యూస్‌లో సెలక్టయి ధీరకు మంచి కంపెనీలో జాబ్ వచ్చింది. దాని పేర అర్చన చేయిద్దామని గుడికి వెళ్లాను. అక్కడ..అక్కడ..కన్పించాడు అచ్యుత్. వంటరిగా కాదు. ప్రక్కన ధీర వుంది. ప్రవర్ కూడా వున్నాడు. నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. నా కాళ్ల క్రింద భూమి కృంగినట్లయి అగాథంలోకి కూరుకుపోతున్నట్లు కుదుపు. కళ్లు చీకట్లు కమ్మినయ్. ఎలాగో నిలదొక్కుకుని వెంటనే వెనక్కి వచ్చేశాను.

ఇన్నాళ్లూ ఎంతో స్థయిర్యంగా, ధీరకు ఆదర్శవంతమైన తల్లిగా వున్నాననే గర్వం అణగిపోయింది. దగాపడిన దానిలా వంటరితనం ఆవహించింది.

'ఇలా జరుగుతోందేమిటి? అతనెవరో ధీరకు తెలుసా? అలా జరిగే అవకాశం లేదే! అతని గుర్తులేవీ ఇంట్లో మిగల్చలేదు. ఆ జ్ఞాపకాలన్నీ ఫోటోలతోటే ఎప్పుడో తగలబెట్టేసాను. అతని ఛాయ నా ఇంటి ఛాయ లక్కూడా రాకూడదని ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాను. మరి ఇదేమిటి? ధీర అంతా తెలిసే చేస్తున్నదా? లేక అచ్యుత్ వెనక వుండి చేయిస్తున్నాడా?" నా మనసు పరి పరి విధాలపోయింది.

ఇంటికొచ్చిన ధీరను నిలదీశాను.

"ధీరా! నిన్నో విషయం అడుగుతాను. దాచకుండా చెప్తావా?"

నా వంక ఆశ్చర్యంగా చూసింది. "ఏ విషయం గురించి?" అనడిగింది.

"ఇందాక నువ్వు గుళ్లో కన్పించావు"

"నువ్వూ గుడికొచ్చావా? నాకు కన్పించలేదే?"

"నాకు మీరు కన్పించారు"

"సారీ మమ్మీ, అనుకోకుండా వెళ్లాం"

"ఈ మధ్య నువ్వు ఇలాంటి సారీలు చాలా చెప్తున్నావ్. సరే. అదలా వుంచు. నీ ప్రక్కన వున్న ఆ వ్యక్తి ఎవరు?"

"ప్రవర్"

"ప్రవర్ నాకు తెల్సుకదా! ఆ మూడో వ్యక్తి"

ధీర కొన్ని క్షణాలు ఆగి "ఓ..ఆ ఎన్నారై అంకులా? ఆయన ప్రవర్ ఫ్యామిలీ ఫ్రెండ్. చాలా జోవియల్‌గా మాట్లాడుతారు. పైగా నేనంటే చాలా అభిమానం!" అంది.

## అతి సర్వత్రా...

రామ్‌గోపాల్‌వర్మ ఆమధ్య తీసిన 'సర్కార్' సినిమా ఓ మోస్తరు విజయం సాధించింది. దీంతో 'సర్కార్ రాజ్' అంటూ సీక్వెల్ తీసాడు వర్మ తాజాగా. ఇందులో అమితాబ్, అభిషేక్, ఐశ్వర్య ముగ్గురూ నటించారు. ఓ రకంగా 'కుటుంబ సినిమా'గా రిలీజైంది. అయితే 'సర్కార్ రాజ్' ఆశించినంత హిట్ కాలేదని ట్రేడ్ పండితులు చెబుతుంటే- వర్మ మాత్రం దీనికి థర్డ్ పార్ట్ కూడా తీసేద్దామని తెగ ఉబలాటపడుతున్నాడట. కానీ అమితాబ్ మాత్రం ఇందుకు సుముఖంగా లేడని అంటున్నారు. ఎందుకంటే ఏదయినా 'అతి' కూడదనేది అనుభవరీత్యా ఆయనకు తెలుసు గనక. మరి వర్మ ఏమాలోచిస్తాడో!

"ఎప్పట్నించీ ఈ అభిమానాలు..ఆప్యాయతలు?"

"ఏం? ఎందుకలా అడుగుతున్నావ్?"

'ధీరకు తెలీదా? తెలిసే నటిస్తోందా? ఒకవేళ తెలియకపోతే నేనే తెలియ చెప్పినట్లవుతుంది కదా? అచ్యుత్ ధీర ఎవరో తెలిసే అభిమానం చూపిస్తున్నాడా? ఆ అవకాశం లేదే! ధీర నాకూతురని ఎలా తెలుస్తుంది. అది పుట్టాక అతను చూడనే లేదే' అనుకున్నాను.

"మాట్లాడవేం మమ్మీ! అంకుల్ గురించి ఎందుకలా గుచ్చి గుచ్చి అడుగుతున్నావ్?" అన్నది ధీర.

"ఏం మాట్లాడనే ? కొత్త కొత్త సమస్యల్ని తీసుకొచ్చి ప్రశాంతత లేకుండా చేస్తున్నావ్"

"సమస్యా! నేనా? ఏ విధంగా?" అంది ఆశ్చర్యంగా.

'తప్పదు. చెప్పక తప్పదు. ఇన్నేళ్లూ ఏ వ్యక్తి గురించి తెలియకూడదని జాగ్రత్తలు తీసుకున్నానో ఆ వ్యక్తే దానికి దగ్గరగా మసులుతున్నప్పుడు దాచటం తెలివి తక్కువ. ఔను...నా ద్వారానే దానికీ నిజం తెలియటం మంచిది' ఆ నిర్ణయానికి వచ్చాను.

"మాట్లాడవేం మమ్మీ?" అసలు నువ్వేమంటున్నావో నాకు అర్థం కావటం లేదు"

"నీ కర్థమైనట్లు చెప్తాను. నువ్వెన్నోసార్లు అడిగావు. నేను దాటవేశాను. కానీ..ఎప్పుడో ఒకప్పుడు చెప్పాల్సి వస్తుందని నాకు తెలుసు. అతను క్రూరంగా నా పట్ల వుండకపోయివుంటే ఈ ఇంట్లో ఒక గౌరవప్రదమైన స్థానంలో వుండాల్సిన వ్యక్తి" అన్నాను.

అది నావంకే ఇంకా ఏం చెప్తానా అన్నట్లు చూసింది.

"అర్థం కాలేదా? అతను..నీ జన్మకు కారకుడు"

"అంటే నాకు డాడీయే కదా"

ఆ పదం వినటానికి...ఒప్పుకోవటానికి నా మనసు అంగీకరించటం లేదు. 'తండ్రి' అనే పదానికి ఎంతో ఔన్నత్యం వుంది. దానికి అతను అర్హుడు కాదు. ఇరవై ఏళ్లు ఒంటిగా నా శక్తిని..సర్వస్వాన్ని ధార పోసి ధీరను తీర్చిదిద్దాను. ఇవాళ కేవలం..దాని పుట్టుకకు మాత్రమే కారకుడన్న చిన్న నిజానికి 'తండ్రి' అనే పదాన్ని ఉచ్చరించటానికి నా మనసు ఇచ్ఛగించటం లేదు. అయినా ఒప్పుకోక తప్పదు. అందుకే ఔనన్నట్లు తలూపాను.

"ఆ సంగతి నాకు తెలుసమ్మా" అన్నది మెల్లగా.

అదిరిపడి చూశాను. "తెలుసా? ఎల్లా తెలుసు?"


"తెలుసు. ప్రవర్ ద్వారా పరిచయమైనప్పుడే మా రిలేషన్ తెల్సింది నా గురించిన వివరాల్ని అడిగి, నేనెవరో గ్రహించి పరిచయం చేసుకున్నారు. ఇరవై ఏళ్ళు తండ్రెవరో తెలీకుండా పెరిగిన నాకు ఆయన్ని చూస్తున్నప్పుడు కలిగిన అనుభూతికి మాటలు లేవు. నన్ను నేను మరిచిపోయాను. ఆయన రూపం మాటలు చూశాక ఇన్నేళ్ళూ నేనెంత కోల్పోయానో అర్థమైంది."

దాని ఒక్కొక్క మాటా ఒక్కొక్క శూలమై నా మనసును తూట్లు పొడిచినంత బాధ కలిగింది.

"అంటే..ఇన్నేళ్ల నా కృషి..తపస్సు అంతా వ్యర్థమేనా? దానికి నేను చేసిందేమీ లేదా? తండ్రి లేని లోటును పూడ్చలేకపోయానన్నమాట. దానిలో ఆ భావాన్ని కలుగనీయకుండా చేయలేకపోవడం నా అసమర్థతా?" అన్న నిస్పృహ ఆవహించింది.

"నిజంగా ఆయన్ని చూస్తే నాకే భావం కలుగలేదమ్మా! ఎందుకంటే ఆ లోటు ఎప్పుడూ నాలో కలుగనీకుండా అన్నీ నీలో చూసుకునేలా తీర్చిదిద్దావు" అని ధీరత అని వుంటే నా జన్మధన్యమయ్యేది. ఒక అందమైన భవనాన్ని ఎంతో ఇష్టంగా నిర్మించుకున్నప్పుడు..అంతలోనే పునాదులతో సహా కూలినప్పటి వేదన..స్తబ్దత..ధీరతో ఇంకేం మాట్లాడాలనిపించలేదు.

"నాకు తెలుసమ్మా..నువ్వు హర్ట్ అవుతావని..అందుకే నీకు చెప్పలేకపోయాను. సమాంతర రేఖల్లా మీ జీవితాలు కలవవని తెలుసు. ఎంత కాదనుకున్నా ఆయన నాకు తండ్రి. నిన్ను కాదని ఆయన కూడా సుఖపడింది ఏమీ లేదు. భార్య కేన్సర్‌తో పోయింది. పిల్లలు లేరు. ఒంటరితనం. చేసిన తప్పులు అనుక్షణం వెంటాడి కృంగదీసినయ్. ఇండియా వచ్చేశారు. అనుకోకుండా నన్ను కలిసినప్పుడు ఆయన కళ్లల్లో కన్పించిన సంతోషం, ఆర్తి చూసి చలించిపోయాను. నిండారా ప్రేమతో, అభిమానంతో ఆయన మాట్లాడుతుంటే తిరస్కరించలేకపోయాను. మనసుకు మంచి గంధం పూతలా చల్లగా హాయిగా ఇంకా, ఇంకా మాట్లాడాలని ఆయన సమక్షంలో గడపాలని అన్పించింది. ఇన్నాళ్లూ పోగొట్టుకున్నదేదో పొందాలన్న ఆరాటం" ధీర సంజాయిషీ ఇస్తోంది.



నాకు వినాలని అన్పించలేదు. నా గదిలోకొచ్చేశాను. మనసు..కళ్లు పొడిబారి మండుతున్నయ్.

ఏడ్చినా కొంత భారం తగ్గేది. అదీ చేత కాలేదు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ ఇరవై ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎంత అపురూపంగా చూసుకున్నాను ధీరను! అయినా దాని మనసులో పూర్తి స్థానాన్ని పొందలేకపోయానంటే ఈ పురుషాధిక్య సమాజంలో నేను పరాజితురాల్ని. కళ్లు మూసుకున్నా గతం కదలాడింది మనసులో.

ooo

ఆరోజు ఏమన్నాడు అచ్యుత్?

“చూడు..నీ అందం చూసో, తెలివి చూసో నిన్ను చేసుకోలేదు. అమ్మా నాన్నా లేని అనాథగా మేనమామ పంచన చేరిన నీకు పెళ్లి చేసే స్తోమత లేక, నీ మామ పడే బాధ చూడలేక, జాలిపడిన అమ్మ మాట కాదన లేక పెళ్లి చేసుకున్నాను. అంతే! ఈ ఇంట్లో నీకు నా విషయం పట్టించుకోనంత వరకూ ఏ లోటూ వుండదు. అమ్మ ఆరోగ్యం మంచిది కాదు. ఆవిడ్ని చూసుకోవటమే నీ డ్యూటీ! నన్ను ప్రశ్నించడం గానీ శాసించటం గానీ చేస్తే సహించను. అర్థమైందా?” అన్నాడు. అతని కొలీగ్ ప్రతిమతో అతి చనువు, పూసుకు తిరగటం చూసి అడిగినందుకు వచ్చిన సమాధానం అది. నేను అనాథనే కావచ్చు. ఇష్టపడి చేసుకున్నాడనుకున్నాను. జాలిపడా! ఒక దంపతుల మధ్య వుండాల్సింది జాలా? అంటే అతను జాలి పడనంతకాలం సంసారం నిలుస్తుంది. అది జారిపోతే? అప్పుడే అన్పించింది. అతని దయాదాక్షిణ్యాలతో జీవితం గడపలేనని. అయినా ఓపిక పట్టాను. ఆ తర్వాత క్రమంగా ఒక్కొక్క నిజాలూ బైట పడ్డాయి.

మంచి జీతంతో మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న అచ్యుత్, తల్లిదండ్రుల్ని చిన్నతనంలోనే కోల్పోయి, మామయ్య పెంపకంలో సామాన్య మధ్య తరగతి జీవితానికి చిన్నతనం నుంచీ అలవాటుపడి పెద్దగా ఆశలూ, ఆశయాలూ లేని నన్ను పెళ్లి చేసుకోవటానికి ఇష్టపడ్డాడని తెలిశాక తన అదృష్టానికి భయమేసింది. మామూలు డిగ్రీ చదువూ, కాస్త అందమూ వున్న తనలో ఏం ప్రత్యేకత కనిపించింది? అన్న అనుమానం పెళ్లయ్యాక తీరింది. తండ్రి లేదు. నడవలేని అనారోగ్యస్థితిలో తల్లి. ఆఫీస్ పనిమీద టూర్లకు వెళ్లినప్పుడు తల్లిని, ఇంటిని చూసుకోగల దక్షత వున్న పిల్ల కావాలి. అది పెళ్లాం రూపంలో వుంటే విశ్వాసంగా పడివుంటుంది. లేమి ఇంటి నుంచి పిల్లను తెచ్చుకుంటే, తన కాలి క్రింద చెప్పులా అణిగివుంటుందనుకున్నాడు. ఆ లక్షణాలన్నీ నాలో కనిపించి తాళి కట్టాడు. ఆ బాధ్యతల్ని చూసుకోవటం తనకేమీ కష్టమనిపించలేదు. ప్రతిమతో అతనికిగల సంబంధం తెలిసాక తల్లి కోసం ఒక నర్స్‌ని అపాయింట్ చేసుకోక నా జీవితాన్ని బలి చేయటం దేనికని తల్లడిల్లాను. అదీకాక ఆధునికతను నరనరానా జీర్ణించుకుని వున్న ప్రతిమను అచ్యుత్ తల్లి ఇష్టపడలేదు. సంప్రదాయం, అణుకువ గల పిల్ల తన కోడలు కావాలని పట్టుపట్టింది. ఆ ఇంటి సిద్ధాంతి ద్వారా మామయ్య గురించి నా గురించీ తెలిసి కబురు పెట్టి నన్ను కోడల్ని చేసుకుంది. అందుకే ఆవిడ పట్ల గౌరవంతో కంటికి రెప్పలా కనిపెట్టుకుని సపర్యలు చేశాను. ఇంటిపని, అత్తగారి సేవలు, రాత్రిళ్లు పొద్దుపోయి వచ్చే అతనికోసం ఎదురు చూడటం..ఇదీ నా దినచర్య.

కొడుకు వైఖరి పెళ్లయినా మారనందుకు ఆవిడ బాధపడేది. కోపగించుకునేది. ఏం చేయలేని నిస్సహాయతతో కుమిలిపోయేది. నా స్వార్థం కోసం, నీ జీవితం బలి చేశాను అని కన్నీళ్లు పెట్టుకునేది. ఆవిడ్ని నాకు చేతనైనంతలో ఓదార్చేదాన్ని. అయినా మానసికంగా కృంగిపోయి, ఆ దిగులుతోనే కాలం చేసింది. ఆమెతోనే ఆ ఇంటికి నా అవసరం తీరిపోయింది. తల్లి అంత్యక్రియలయ్యాక నన్ను మామయ్య ఇంటికి పంపించేశాడు. ఆ తర్వాత అతని నుంచి ఏ కబురూ లేదు. పరిస్థితి ఏమిటో అర్థంకాక మామయ్యకు అనేక అనుమానాలొచ్చాయి.

“ఏమైంది? మీ ఇద్దరూ గొడవ పడ్డారా?” అనడిగాడు.

“అట్లాంటిదేం లేదు” అన్నాను.

“ఏం లేకపోతే అచ్యుత్ ఎందుకు రావటం లేదు”

ఏం చెప్పాలో అర్థం కాలేదు.

“ఒకవేళ గొడవపడినా నువ్వు సహనంతో సర్దుకుపోయి వుండాల్సింది. తప్పు అతనిలో వున్నా ఆడపిల్ల ఒదిగి వుండటం నీ లక్షణం. పంతాలకు పోతే కాపురం నిలుస్తుందా? పద! అతని కాళ్లు పట్టుకుని క్షమాపణ అడుగుదువుగాని. అవసరం మనది!” అన్నాడు.

“ఒద్దు మామయ్యా, అలా నాకిష్టం లేదు” అన్నాను.

“వెళ్లకపోతే నష్టం నీకే! నేను మాత్రం ఎంతకాలమని చూస్తాను”

“ఇంకా నిన్ను ఇబ్బంది పెట్టను మామయ్యా! నేనే ఏదో ఒక మార్గం చూసుకుంటాను”

“అంటే ఏం చేస్తావ్? ఎక్కడికెళ్తావ్? ఎట్లా బ్రతుకుతావ్? చూడు నిర్మలా! అతను ఆస్తి, అంతస్తు వున్నవాడు. పైగా నీ భర్త. ఎన్ని సమస్యలున్నా అతని నీడలో వుంటేనే నీకు మర్యాద.”

“లేదు మామయ్యా! నాకు గుర్తింపులేనిచోట వుండలేను. అయినా నేను అతనితో కాపురం వద్దనుకుని నా అంతట నేను రాలేదు. తనే వెళ్లమన్నాడు. అతనొచ్చి రమ్మని పిలుస్తేనే వెళతాను” అన్నాను ఖండితంగా.


“సరే..నీ మంచి కోరి చెప్పాను. ఆ తర్వాత నీ ఇష్టం”

అప్పుడే మరో విఘాతం. నేను గర్భవతినని తెలిశాక సంతోషించాలో, బాధపడాలో అర్థం కాలేదు. అర్ధరాత్రి తాగి వచ్చిన మత్తులో అరుదుగా నన్ను దగ్గరికి తీసుకునేవాడు అచ్యుత్ నా ఇష్టాయిష్టాల్ని పట్టించుకోక. ఆ మాత్రానికే అతని ప్రతిబింబాన్ని మోయాల్సి వస్తుందనుకోలేదు. నా జీవితానికి ప్రతిబంధకంగా మారుతుందన్న భయంతో అబార్షన్ చేయించుకుందామనుకున్నాను.

ఆ సమయంలోనే అచ్యుత్ నుంచి ఫోన్-“ఏంటి? మీ మామయ్య చెప్పింది నిజమేనా? పాపం..నా ఆనవాళ్లు ఈవిధంగా మిగుల్చుకుని నాపై హక్కు పొందాలనుకుంటున్నావేమో! నాకు ఎలాంటి సెంటిమెంట్లూ లేవు. ముందా చెత్త వదల్చుకుంటే నీకే మంచిది. మరో విషయం..అమ్మతో పాటే నీ అవసరం తీరిపోయింది. నువ్వు మళ్లీ నా దగ్గరకొచ్చే ప్రసక్తే

## పాపం షారుఖ్!

దాదాపు పదహారు, పదిహేడేళ్ల క్రితం ‘ఫౌజీ’, ‘సర్కస్’ లాంటి దూరదర్శన్ సీరియల్స్‌లో నటించడం ద్వారా గుర్తింపు పొంది బాలీవుడ్‌లో చాన్సులు సంపాదించుకుని టాప్ స్టార్ అయ్యాడు షారుఖ్ ఖాన్. ఆమధ్య అమితాబ్ తర్వాత ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ ప్రోగ్రామ్‌కి హోస్ట్‌గా చేసి ‘ఫెయిల్’ అయిన షారుఖ్- ఇప్పుడు ‘పాంచ్‌వీ పాస్’తో మళ్లీ బుల్లితెరకి వచ్చాడు. కానీ ఈ గేమ్‌షో కూడా ఫ్లాప్ దిశగా నడుస్తోందని టీఆర్‌పీ రేటింగ్స్ చెబుతుండడంతో జూలై నెలాఖరుకల్లా ఆ కార్యక్రమాన్ని ముగించేయాలనుకుంటున్నారట నిర్మాతలు. బుల్లితెర నుంచి పైకెదిగిన షారుఖ్‌కి మళ్లీ అదే బుల్లితెరపై ఈ పరాజయమేమిటో?




లేదు. ఆశ వదిలి నీ దారి నువ్వు చూసుకుంటే మంచిది. అన్నట్టు త్వరలో నేను యు.ఎస్.వెళ్లబోతున్నాను. చట్టప రంగా నీ నుంచి డైవోర్స్ కావాలి. త్వరలో పేపర్స్ పంపి స్తాను. భయపడకు...నీకు మనోవర్తి వస్తుంది" అంటూ పెట్టేశాడు.

'ఎంత నిర్దాక్షిణ్యం! ఎంత వికృత స్వభావం! నిష్కార ణంగా ఒక నిండు జీవితాన్ని కాలరాసే అధికారం ఎవరి చ్చారు? పెళ్లి చేసుకోమని నేనేం వెంటపడ్డానా? అతడు నన్ను ఆదరంతో అందలమెక్కిస్తాడన్న ఆశ ఎప్పుడూ లేదు. అయితే ఇలా తెగతెంపుల దాకా వస్తుందనుకో లేదు. ఎప్పుడో ఒకప్పుడు ఒక మంచి క్షణంలో అతనికి కనువిప్పయి, వివాహబంధంలోని ఔన్నత్యాన్ని తెలుసు కుని పశ్చాత్తాప పడతాడనుకున్నాను. అది ఎంతకాలమ యినా వేచి వుందామనుకున్నాను. నా విలువ తెలిసి క్షమాపణ కోరి రమ్మన్నప్పుడే వెళ్దామనుకున్నాను. నా ఆశలన్నీ కుప్పకూలినయ్. భవిష్యత్ అగమ్య గోచరంగా

## ఆయేషా ఆశలు!

ఇప్పటి దాకా ఆయేషా టకియాకి చెప్పుకోదగిన కమర్షి యల్ హిట్టు లేదు. అందుకనే ఇప్పుడామె ఆశలన్నీ సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న హిందీ 'పోకిరి' మీదే వున్నాయి. తెలుగులో ఇలియానా చేసిన పాత్రను ఆమె ధరిస్తోంది. 'వాంటెడ్ డెడ్ అండ్ అలైవ్' పేరుతో తయారవుతున్న ఈ సినిమాలో ఆయేషా లోని డాన్సింగ్ స్కిల్స్ నిరూపించే విధంగా పాటలున్నాయిట. పైగా ప్రభుదేవాయే దీనికి దర్శకుడు. నిర్మాత బోనీకపూర్. తెలుగు, తమిళంలో కలెక్షన్లలో దుమ్ము దులిపిన 'పోకిరి' హిందీలో ఆయేషాకి ఎలాంటి మేలు చేస్తుందో మరి!



తోచింది. అంతులేని నిస్పృహ, కడుపులో ప్రాణం పోసుకున్న మరో జీవి..ఏం చేయాలో తోచని అయోమయ పరిస్థితి. ఆ డిప్రెషన్‌లో వున్నప్పుడే తన ప్రాణ స్నేహితురాలు మేధ వెన్ను దన్నుగా నిల బడింది. ఇంటర్ దాకా కలిసి చదువుకోవటమే కాదు, ప్రాణంగా మెలిగారు. మేధ తను మెడిసిన్‌లో చేరింది. ఆర్థిక వనరులు లేక తను డిగ్రీ వైపు మొగ్గింది. మార్గాలు వేరైనా మనసుల్లోని ఆత్మీయ తాభావం సజీవంగానే వుంది.

తన వైవాహిక జీవితంలో మోసపోయిన విధానం తెలిసి మేధ కలవరపడింది. అచ్యుత్‌పై మండిపడింది. "ఏమనుకుంటున్నాడతను? నీకేం చేతకాదనుకుంటున్నాడా? తగిన గుణపాఠం నేర్పాలి. మనం ఫ్యామిలీ కోర్టుకెళదాం. అతని అరా చకం బైటపెట్టి సాక్ష్యాలు చూపిద్దాం. వున్న ఉద్యోగం వూడగొట్టి మళ్లీ జీవితంలో పైకి లేవ కుండా చేద్దాం" అన్నది ఆవేశంగా.

"ప్రతీకారాలు కక్షలతో జీవితం మరించి సంక్లి ష్టమౌతుంది. కోల్పోయిన జీవితం తిరిగి రాదు. అయిందేదో అయింది. పుట్టబోయే నీ బిడ్డని తల్చుకుని అతన్ని వదిలేయ్!" అన్నాడు మామయ్య.

"నా జీవితంలో అతని పాత్ర ముగిసిపోయింది. అతని ముఖం చూడటం కూడా నాకిష్టం లేదు. మనోవర్తి రూపంగా అతనిచ్చే ముష్టి నాకవసరం లేదు. నన్ను నేను పోషించుకోగలను" అన్నది తను.

"నిజమే! నీ జీవితం నీ చేతుల్లోనే వుంది. అతనితో పెళ్లి ఒక పీడకలగా మర్చిపో. సంకల్పం వుండాలేగానీ జీవితంలో ఉన్నత స్థానానికి చేరటానికి ఎన్నో అవకా శాలు వున్నాయ్. నీకెలాంటి సహాయం కావాలన్నా నేను న్నానని మర్చిపోకు" అంటూ ఎంతో స్థయిర్యాన్నిచ్చింది మేధ.

అచ్యుత్‌తో తెగతెంపులు చేసుకుంది. పట్టుదలగా స్టడీస్ కంటిన్యూ చేసింది. ధీర పుట్టాక దాన్ని చూసు కుంటూ ప్రయివేట్‌గా ఎమ్.బి.ఏ చేసింది. జాబ్ వచ్చింది. ఆర్థిక బాధలు తగ్గాయి. అచ్యుత్‌ను చూశాక మగవాడంటేనే అసహ్యం ఏర్పడింది. తన జీవితంలో మరొక మగాడి నీడైనా పడకూడదనుకుంది. తన ఆలోచన, ఆరాటం, అనురాగం, ప్రేమ అన్నీ ధీరే! ప్రశాంతసాగరంలా వున్న తన జీవి తంలో వున్నట్టుండి ఈ పెను తుపాను" నిట్టూర్చింది నిర్మల ముగిస్తూ.

నిశ్శబ్దంగా వింటున్న మేధ 'తర్వాత' అన్నట్టు చూసింది.

మళ్లీ చెప్పటం మొదలుపెట్టింది నిర్మల.

* * *

కలత చెందిన మనసుతో అస్థిమితంగా పడుకుని వున్న నా దగ్గర కొచ్చింది ధీర. నా కాళ్ల దగ్గర కూర్చుంది. "నామీద కోపం వచ్చిందామ్మా!" అన్నది. నేను మాట్లాడ లేదు.

"నా వైపు నించి కూడా ఆలోచించి చూడమ్మా! పుట్టింది మొదలు నువ్వు తప్ప ఆత్మీయుల్ని ఎరుగను. నువ్వు లేని సమయంలో ఎంతో వంటరి తనాన్ని అనుభ వించేదాన్ని. నాకో చెల్లెలు గానీ తమ్ముడుగానీ లేరే అని బాధపడేదాన్ని. కనీసం నాన్నమ్మగానీ, అమ్మమ్మగానీ వుంటే ఎంతో బావుండేదనిపించేది. ఇరుగు పొరుగు ఇళ్లల్లో స్కూల్లోని ఫ్రెండ్స్ ఇళ్లల్లో అందరికీ అందరూ వున్నారు. వాళ్ల ప్రేమలూ, మమతానురాగాలు చూస్తుంటే నేనేం కోల్పోయానో తెల్సి అసూయగా వుండేది. నాలో ఎప్పట్నించో గూడుకట్టుకుని వున్న ఈ అసంతృప్తి, ఆయన్ని చూశాక బ్రద్దలైంది. డాడీ పలక రింపు, ఆ వాత్సల్యం, ఎంతో ఇష్టంగా అన్పించి ఇంకా ఇంకా కావాలనిపించింది. ఆయన సమక్షంలో ఏదో స్వాంతన" అంటూ పరవశంగా చెప్పుకుపోతోంది ధీర.

"అంటే? ఇన్నేళ్లలో నేను నీకేం ఇవ్వలేదా?"

"లేదనని ఎట్లా అనగలనమ్మా! ఇచ్చావు. నీకు శక్తివున్నంతవరకూ ఏ లోటూ చేయ లేదు. అయితే ఇది వేరు. అనుభవించాక తెల్సింది అందులోని మాధుర్యం"

"ఎంత కృతఘ్నుత! నీకోసం ఎన్ని వదు లుకున్నానో తెలుసా? నువ్వుంటే చాలు. ఇంకేం వద్దనుకున్నానే! ఆ భావం నీలో కల గలేదంటే నేనెంత దురదృష్టవంతురాల్నో అర్థమైంది"

"అమ్మా! నాకోసం చాలా చేశావు. కాదన్ను. లోకంలో ఏ తల్లి అయినా పిల్లల్ని ప్రాణప్రదంగానే చూస్తుంది కదా! అలాగే నీ బాధ్యతని నెరవేర్చావు"

"బాధ్యతగా మాత్రమే చేశానా?"

"స్వార్థంతో కూడా. నీ కోసం, నీ వంటరి తనం పోగొట్టుకోవటం కోసం...నువ్వు తప్ప మరో ప్రపంచం నాకుండకూడదన్న స్వార్థం కోసం"

లాగి చెంపమీద కొట్టాను. ధీర చలించ లేదు.

"నీ మానసిక స్థితిని అర్థం చేసుకోగ లను. కానీ అమ్మా..కోపాన్ని కంట్రోల్ చేసు కుని ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకో...నా పట్ల నువ్వు పెంచుకున్న ఆశలు..మమతాను రాగాల్లో ఏమాత్రం స్వార్థ చింతన లేదా? లేన ప్పుడు నువ్వెందుకిలా బాధపడ్తున్నావ్?"

“నువ్విలా ప్రశ్నించేరోజు నా జీవితంలో ఎదురౌతుందని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే ఇంత వేదన. ఎవరి చేత అవమానించబడి తిరస్కరించబడ్డానో ఏ మనిషిని నిలువెల్లా అసహ్యించుకుంటానో, ఆ వ్యక్తి ఎప్పుడైనా జీవితంలో ఎదురుపడితే, నిన్ను గర్వంగా చూపాలనుకున్నానో ఆ వ్యక్తి ఆ మనిషితో కల్సి నన్నిలా చిత్రవధ చేస్తావనుకోలేదు”

“ప్రేమించటంలో వున్న శాంతి ద్వేషించటంలో వుంటుందామ్మా?”

“ఇలాంటి మాటలు నాకు చెప్పొద్దు ధీరా! ఒక ఆవేశంతో, ధ్యేయంతో నిన్ను తీర్చిదిద్దాను. ఈ సమాజంలో మగవాడి తోడు లేకుండా ఆడది తలెత్తుకుని ఆత్మస్థైర్యంతో బ్రతగ్గలదు అని చెప్పాలనుకున్నాను”

“చిలక పలుకులులాగా నేనూ అలా చెప్తేనే నీకు సంతోషమా! నీకు ప్రతిబింబంలాగా మాత్రమే వుండాలా? నాకో వ్యక్తిత్వం, స్వంత భావాలూ వుండకూడదా?”

నిర్ఘాంతపోయాను.

“డాడీని తల్చుకోకూడదు. ప్రవర్‌ని ఇష్టపడకూడదు. ఏ మగవాడి నీడా నాపై పడకూడదు. అలా వుంటేనే నీ ఆశయం నెరవేరినట్లా? ఈ సృష్టిలో ఆడా మగా ఇద్దరూ అవసరమే. ఒకర్నొకరు ద్వేషిస్తూ పోతే సమాజం నిలబడుతుందా? మానవత్వాన్ని మరచి రాక్షసంగా కొందరున్నట్లే..అమృతతత్వం కూడా వుంటుంది. దాన్ని అంగీకరించటంలో నాకు తప్పేం కన్పించటం లేదు”

“అంటే? నేను అమితంగా ద్వేషించే ఆయన అమృతతుల్యుడా? అసలు నువ్వు నా రక్తం పంచుకు పుట్టిన కూతురివేనా? ఇంతకంటే కృతఘ్నత లోకంలో వుంటుందా?” నిప్పులు కురిపించాను.

“ఆ ఉద్దేశ్యంతో అనటం లేదమ్మా”

“ఇంక నోరు మూస్తావా..నిన్ను చూస్తుంటేనే నాకు అసహ్యం వేస్తోంది. నా కళ్లముందు నుంచి వెళ్లు. నువ్వింకా ఇక్కడే వుండి ఇలా మాట్లాడితే పిచ్చెక్కి నేనేం చేస్తానో నాకే తెలీదు. దయచేసి నన్ను కాస్సేపు వంటరిగా వదిలేయ్” అన్నాను కఠినంగా.

ధీర మౌనంగా కాస్సేపు అలాగే నిలబడింది. నేను ముఖం తిప్పుకుని పడుకున్నాను. అది వెళ్లిపోయింది. చాలాసేపటి తర్వాత నన్ను నేను కూడదీసుకోవటానికి ‘భగవద్గీత’ తీసి చదివాను. ఏది ఎలా జరగాల్సి వుందో అలా జరుగుతుంది. అన్న భావం కలిగి మనసు కొంచెం కుదట పడింది. ధీరకు బాగా కోపం వచ్చివుంటుంది. సమస్యలు ఎప్పుడూ వుండేవే! వాటికోసం బ్రతుకు భారం చేసుకోవటం అవివేకం అన్పించింది. చేసిన వంట అలాగే వుంది. ఆకలికి ఆగలేని ధీర అభోజనంగా వుందని మనసు పీకింది. ధీర కబుర్లతో, నవ్వులతో సందడిగా వుండే ఇల్లు స్మశానవాటికలా నిశ్శబ్దమైపోవటం భరించలేకపోయాను. ‘ధీర చిన్న పిల్ల, నా పెద్దరికం ఏమైపోయింది. నా కోపం అసంతృప్తి దానిపై చూపించి నేను సాధించేదేమిటి?’ అని సమాధాన పడి, దాని రూంలోకెళ్లాను. అక్కడి దృశ్యం చూసి గుండె బ్రద్దలైంది. అస్తవ్యంగా పడుకున్న ధీర స్పృహలో లేదు. ప్రక్కనే స్లీపింగ్ పిల్స్ బాటిల్ వుంది. ఓ వెర్రికేక వేసి తల బాదుకున్నాను. తర్వాత ఆదుర్దాగా నీకు ఫోన్ చేశాను” అంటూ ముగించింది నిర్మల.

భారంగా నిట్టూర్చింది మేధ.

“జరిగింది విన్నావుకదా? అది ఎందుకింత అఘాయిత్యం చేసింది? నేను తప్పు చేశానా? నా ఆలోచనా విధానంలో గానీ, దాని పట్ల నా ప్రవర్తనలోగానీ పొరపాటు వుందా? అందుకే ఇలా చేసి నన్ను శిక్షించాలనుకుందా? చెప్పు మేధా?” అంది నిర్మల ఆవేదనగా.

మేధ కాస్సేపు ఆగి ఆలోచనగా అంది.

“తప్పు ఎవరిది అనేది కాదు ఇప్పుడు సమస్య..జరగవల్సింది ఏమిటి? అన్నది. అచ్యుత్‌ని క్షమిస్తావా..లేదా? అన్నది నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను. కానీ ఒక్కటి ఆలోచించు. సమాజంలో అధికశాతం ఆడవాళ్లు భర్తలో ఎన్ని లొసుగులున్నా కలిసే జీవిస్తున్నారు. ‘ఎప్పుడో ఒకప్పుడు తన తప్పులు తెలుసుకుని మారకపోతాడా’ అన్న ఆశాభావంతోగానీ, కుటుంబ వాతావరణం కోసం గానీ, పిల్లల కోసం గానీ ఏదైనా కారణం కావొచ్చు. ఆడదానిలోని ఈ బలహీనతల్ని ఆసరా చేసుకుని పురుషాధిక్య సమాజం ఇచ్చిన అహంకారంతో మగవాడు జులుం చేస్తూనే వున్నాడు. ప్రస్తుత యువత ఆలోచనా విధంలో కొంత మార్పు వచ్చినా ఇంకా మార్పు రావాల్సిన అవసరం వుంది. ధీర విషయంలో నువ్వు ఆందోళన పడాల్సింది గానీ, వ్యతిరేకించాల్సిన అవసరం గాని వుందా అన్నది ప్రశాంతంగా ఆలోచించు. అచ్యుత్ ముందు ఓడిపోయానన్న నీ భావనలో అర్థం లేదు. నిజానికి నీకే అతను తలవంచాడు. అన్నీ కోల్పోయి రక్తసంబంధానికి దాసోహమన్నాడు. కూతురి ప్రేమకోసం, తండ్రి అనే గుర్తింపుకోసం తపిస్తున్నాడు. అంత మాత్రాన అతనితో తిరిగి జీవితం ప్రారంభించమని, ఏళ్ల క్రితం తెగిపోయిన బంధాన్ని తిరిగి ముడివేయమని చెప్పను. ఇప్పుడు చేయాల్సింది నువ్వూ, ధీర ఒకరి అభిప్రాయాల్ని మరొకరు గౌరవించాలి. మీ ఇద్దరి మధ్య కొంచెం త్యాగం, సుహృద్భావం కావాలి. అదెలా సమన్వయ పరచాలో మీ ఇద్దరూ ప్రశాంత చిత్తంతో ఆలోచించండి. ఇకపోతే ప్రవర్ సంగతి..ధీర మనసుకు నచ్చినవాడు..అతన్ని సంస్కారవంతంగా మలచగల సమర్థత ధీరకువుంది. ఆ విషయంలో భయాలు పెంచుకోకు” అన్నది మేధ.

నర్స్ వచ్చి “డాక్టర్! ఆ పిల్లకు తెలివి వచ్చింది” అన్నది.

ఇద్దరూ ధీర దగ్గర కెళ్లారు.

తల్లిని చూసి “నన్ను క్షమించమ్మా! ఇలా చేసి నిన్ను మరింత క్షోభ పెట్టాను. అన్నీ మర్చిపోదాం. ఇక నుంచీ నీ ఇష్టప్రకారమే నడుచుకుంటాను” అన్నది ధీర కన్నీళ్లతో.

కూతురి తల నిమురుతూ దగ్గుత్తికతో “లేదురా! నాదే తప్పు. నీ మనసు అర్థం చేసుకోకుండా నా భావాలన్నీ నీపై రుద్దాను. అన్నీ మర్చిపో. నీ సంతోషం కంటే నాకు ఏదీ ఎక్కువ కాదు” అంది నిర్మల.

వాళ్లిద్దర్నీ చూసి రిలీఫ్‌గా నవ్వుకుంది డాక్టర్ మేధ.

## మరో చాన్స్

తొలిచిత్రం ‘గొడవ’ పరాజయం పాలుకావడంతో వచ్చిన ముంబాయికే తిరిగెళ్లిపోయిన శ్రద్ధా ఆర్య అక్కడ ఓ హిందీ సినిమా చేస్తోంది. ఈ సమయంలోనే ఆమెకి మళ్లీ టాలీవుడ్ నుంచి ఆఫర్ రావడంతో తెగ సంబరపడుతోంది శ్రద్ధ. ఆర్యన్ రాజేష్ హీరోగా నిర్మాణం కానున్న ఓ సినిమాలో హీరోయిన్ చాన్స్ శ్రద్ధని వరించింది. ఈ రెండో సినిమా అయినా టాలీవుడ్‌లో తన కెరీర్‌కి మంచి బ్రేక్ అవుతుందని ఆశిస్తోంది శ్రద్ధ.

